7. జీవంబు వస్తువులు – శ్రేయస్సు దాన స్వ– భావంబు శక్తియు – భాగ్యంబులు = నీవలననే లభ్యమై వెలయుచున్నవి – నీ వాసమే మాకు – నిత్యానందంబు ॥స్తుతియు॥

– ముంగమూరి దేవదాసు

## 573 క్రైస్తవ దాతృత్వము

రా –శంకరాభరణము (చాయ :యేసునామంబెత్తి పాడుదమ) తా – అట

దాతృత్వమును గలిగి పెరుగుదమ = ధనము – ధాత్రి దేవుని దంచు నెఱుగుదమ ॥దాతృ॥

1. శక్తికొలఁది కాన్కలర్పింతమ = మన – భుక్తినుండి కొంతఁ దీయుదమ ॥దాతృ॥
2. సంతోషముగ నియ్య సాగుదమ = మన – స్సంతటితోఁ జేయ నేగు దమ ॥దాతృ॥
3. గర్వఘనములు వీడి యర్పింతమ = యుర్వి – సర్వ మాయనదంచు నేర్పింతమ ॥దాతృ॥
4. సంఘ సేవకు సొమ్ము సమకూర్తమ = క్రీస్తు – సంఘ యక్కఱ లన్ని తీర్చుదమ ॥దాతృ॥
5. ప్రతియాదివార మిది మది నుంతమ = దీని ప్రతి సంఘస్థుఁడు చేయ బోధింతమ ॥దాతృ॥
6. విధిఁ దలఁచి దుర్బలుల రక్షింతమ = సంఘ – విధవాళి దానముతో దర్శింతము ॥దాతృ॥
7. దిక్కులేని జనుల దీవింతమ = వారి – యక్కఱలలో మేలుఁ గావింతమ॥దాతృ॥
8. పుచ్చుకొనుటకంటె నిచ్చుదమ = మఱల – నిచ్చు తండ్రికి స్తుతుల నిచ్చెదమ ॥దాతృ॥
9. వెదజల్లి యభివృద్ధి పొందుదమ = మోక్ష – పదవు లను భవింపఁ బరుగిడుదమ ॥దాతృ॥
10. వర్ధిల్లిన కొలది చెల్లింతము = లోక – వ్యర్థ ఖర్చులనెల్ల మళ్లింతమ ॥దాతృ॥

– మోర్త ప్రకాశము



## 574 క్రైస్తవ దాతృత్వము

రా –నాధనామక్రియ (చాయ :భజన చేయు విధము) తా – అట

ఇచ్చునట్టి విధము తెలియండి – ప్రియులారా మీరు – హెచ్చు పొందు విధము ఇది నుండి = పుచ్చుకొనుట కన్న నెప్పు – డిచ్చుటయే కడు ధన్యత యని – హెచ్చరించి చెప్పలేదా – యేసు ప్రభు వపొస్తలులకు ॥నిచ్చు॥

1. శక్తికొలఁది దాన మీయుండి – సోదరులార – భక్తికొలఁది పరుల కీయుఁడి= శక్తి లేదని సాకు చెప్పక – సణగ కేమియు సరగ శ్రద్ధా – సక్తితో పేదలకు నిచ్చుట – యుక్త మని భావించి మదిలో ॥నిచ్చు॥
2. నీతిబోధలు చేయువారికి – బోధకులైన – నిఖల పాలకులైన వారికి = ఆతురముతో నీయవలెనని – యనుభవముగల మీరలెల్లరు – చేతులార నీయుదయ్య – ప్రీతి తోడును వారవార ॥నిచ్చు॥
3. ఆలయ కృత్యములు జరిగించు –యాజకుఁ డెపుడు – నాలయంబువలన జీవించు = ప్రాలుమాలక పనిని జేయఁ బరఁగ మీ యర్పణలఁ గాన్కల – బలవంతము లేక మీరు పలువిధంబు నియ్య వెదకుడి ॥నిచ్చు॥

–బన్యన్ జోసఫ్

## 575 క్రైస్తవ దాతృత్వము

రా –సౌరాష్ట్ర (చాయ :మనసానందము బొందుటకన్నను) తా – ఆది

సంతోషముతో నిచ్చెదు వారిని – నెంతో దేవుఁడు ప్రేమించున్ = వింతగ వలసిన –దంతయు నొసంగును – వినయ మనసుగల – విశ్వాసులకును ॥సంతోషముతో॥

1. అత్యాసక్తితో నధికప్రేమతో – నంధకార జను లందఱకు = సత్య సువార్తను – జాటించుటకై – సతతము దిరిగెడు – సద్భుక్తులకు ॥సంతోషముతో॥
2. వేదవాక్యమును వేరు వేరు గ్రా – మాదుల నుండెడు బాలురకు = సాధులు ప్రభుని సు – బోధలు నేర్పెడి – సజ్జన క్రైస్తవోపాధ్యాయులకు ॥సంతోషముతో॥